క్లుప్తంగా

6న బీసీ ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న వడ్ల జగదీష్

తిరుపతి కల్చరల్ : నగరంలోని ఇందిరా మైదానంలో జూలై 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బీసీ ఆత్మగౌరవ భరోసా సభ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు వడ్ల జగదీష్ తెలిపారు. శనివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు బాలాజీ కాలనీలోని పూ లే విగ్రహం నుంచి స్కూటర్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో నేతలు సోమశేఖర్, ఆవుల పాటి బుజ్జిబాబు, విజయ్ ఉత్తరాది. రఘునాథ్ సింగ్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

'వండర్ బుక్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ తదితరులు

తిరుపతి సిటీ : నగరంలోని ఆర్‌కే అబాకస్ సంస్థ 567 మందితో సామూహికంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ పోస్టర్‌ను తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి ఆవిష్కరించారు. శనివారం తుడా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గేట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, అపస్మా రాయలసీమ రీజినల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు. తుడా చైర్మన్ మాట్లాడుతూ పిల్లల ప్రతిభను వెలికితీయడంలో ఆర్కే విద్యాసంస్థల కృషి అభినందనీయమన్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి డైరెక్టర్ ఆర్కే విమల మాటాడుతూ విద్యార్థుల పేర్ల నమోదు, ఇతర వివరాలకు 99 89500074 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పీవీ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న స్వరాజ్యలక్ష్మి తదితరులు

తిరుపతి కల్చరల్ : ఆర్థిక సంస్కరణల ఆద్యుడు, రాజనీతిజ్ఞుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహరావు దేశాభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి కొనియాడారు. శనివారం చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో భాగవతుల జయలక్ష్మి, పీఆర్ఎల్ కుమార్, డి.హారిక, డి.లీలావతి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రభాకర్ నాయుడు, మురళీధర్ శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువే పరమావధి



విద్యార్థులతో అతిథులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : విద్యార్థులకు చదువే పరమావధి కావాలని, లక్ష్యం నిర్దేశించుకుని సాధనకు అడుగులు వేయాలని డీఎస్పీ శ్రీలత సూచించారు. శనివారం యూత్ హాస్టల్‌లో మన సంస్కృతి సంస్థ నిర్వహించిన నేషనల్ ఒలింపియాడ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రుల మాట వినాలని కోరారు. తహ సున్నీసా బేగం మాట్లాడుతూ స్వామి వివేకానందను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రొఫెసర్ నీరజ, విజయకుమార్, డాక్టర్అంకయ్య, నాగార్జున, డాక్టర్ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రజా రవాణా సేవలు

తిరుపతి అర్బన్ : జిల్లాలో పకడ్బందీగా ప్రజా రవాణా సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. డీపీటీఓగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్ శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

బాబోయ్.. భరించలేం!

రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఒకవైపు పంట ఉత్పత్తులను సజావుగా విక్రయించుకునే పరిస్థితులు లేవు. మరోవైపు గిట్టుబాటు ధరలు దక్కవు.. సరే నేరుగా మార్కెట్ యార్డుకు తరలించుకుని అమ్ముకుందామంటే అక్కడి వాతావరణం మరింత అధ్వాన్నంగా తయారైంది. కనీస వసతులు కరువై.. పారిశుద్ధ్యం దూరమై.. ముక్కుమూసుకుని వ్యాపారం సాగించాల్సిన దుస్థితి దాపురించింది. అసలే మామిడి పండ్ల సీజన్.. దీనికి అపరిశుభ్రతతోడు కావడంతో ఈగలు.. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. యార్డులోకి అడుగు పెట్టగానే చెత్తకుప్పలే స్వాగతం పలుకుతున్నాయి. అత్యవసర సమయాల్లో మహిళా రైతుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

- అడుగు పెట్టాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..!
- అధ్వాన్నంగా వ్యవసాయ మార్కెట్ యార్డు
- పూర్తిగా పడకేసిన పారిశుద్ధ్యం
- ఈగలు.. దోమల స్వైరవిహారం
- కనీస వసతులు కరువు
- ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేరు

తిరుపతిరూరల్: తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డును అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. గోదాములు, దుకాణాల ముందు మురుగునీరు ప్రవహిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం తాగునీటి సౌకర్యం, రైతులకు విశ్రాంతి గదులు లేకపోవడం, వ్యాపారులకు అత్యవసరమైన మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అందులో మహిళా రైతులు, వ్యాపారులు అత్యవసర సమయాల్లో పడుతున్న అవస్థలను మాటల్లో చెప్పలేని పరిస్థితి. మార్కెట్ యార్డులోకి వెళ్లగానే చెత్తకుప్పలు, మురుగునీరు దర్శనమిస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వెనుతిరిగి వెళ్లిపోయే దుస్థితి.



మురుగుమయంగా పరిసరాలు

పాలకవర్గం ఏదీ..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు పాలకవర్గం ఏర్పాటు చేయలేదు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఈ యార్డులో సమస్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డు కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

లేని స్నానపు గదులు

సుదూర ప్రాంతాల నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చే లారీ డ్రైవర్లకు విశ్రాంతి, స్నానపు గదులు లేకపోవడంతో బహిరంగంగానే స్నానం చేయాల్సి వస్తోంది. అలాగే యార్డులో పనిచేసే కూలీలకు సైతం ఇదే గతి. కొనుగోలుదారులు ఇక్కడి పరిస్థితులను చూసి అసలు ఇక్కడ అధికారులు ఉన్నారా..? లేదా..? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంత అధ్వాన్నంగా మార్కెట్ యార్డు ఎప్పుడూ లేదని గుర్తుచేసుకుంటున్నారు.



భూమనను కలిసిన విశ్వేశ్వరరెడ్డి



భూమనతో మాట్లాడుతున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే

తిరుపతి మంగళం : తిరుపతి పద్మావతిపురంలోని నివాసంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని శనివారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడు వివాహానికి రావాలంటూ భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందించారు.

విఫలం.. కూటమి ప్రభుత్వం

తిరుపతి కల్చరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విమర్శించారు. శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మాటలు, హామీలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులకు ఏమాత్రం చేయూతనందించలేదని ఆరోపించారు. గుజ్జు ఫ్యాక్టరీల వద్ద రైతులు తమ పంట అమ్ముకునేందుకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తోతాపురి మామిడిని కిలో రూ.12 చొప్పున కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశించినప్పటికీ ఫ్యాక్టరీలు బేఖాతర్ చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మామిడికి మద్దతు ధర ప్రకటించి, పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీవారి మెట్టు వ్యాపారులు సుమారు 300 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ సర్కారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్విమ్స్ కార్మికులక చేపట్టిన దీక్షకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే జిల్లాలో పెచ్చుమీరిన ఇసుక, మట్టి మాఫియాను అరికట్టాలని స్పష్టం చేశారు. శెట్టిపల్లె భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నేతలు సాయిలక్ష్మి, జయచంద్ర, కేఆర్ఎస్ మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

నోటీస్ బోర్డు

- డ్రగ్స్ నివారణే లక్ష్యంగా నగరవాసులకు అవగాహన కల్పిస్తూ ఉదయం 6 గంటలకు పూర్ణకుంభం సర్కిల్ నుంచి మత్తు వదలరా పేరిట 3కే రన్.
- స్విమ్స్ వద్ద ఉదయం 10 గంటలకు స్విమ్స్ కార్మికుల రిలే నిరాహారదీక్ష నాలుగో రోజు.
- యూత్ హాస్టల్‌లో ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యలపై సదస్సు.
- తిరుపతి, తిరుమలలోని హథీరాం భావాజీ మఠంలో భావాజీ 596వ జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం 7 నుంచి భోగ్‌బండార్, హోమాలు, ప్రత్యేక పూజలు.
- శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శన టోకెన్ల పంపిణీ.

అభివృద్ధి పనులు వేగవంతం

తిరుపతి తుడా : నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం స్మార్ట్ సిటీలో భాగంగా వినాయక సాగర్‌లో సాగుతున్న అభివృద్ధి పనులతోపాటు నగరంలో పెండింగ్‌లో ఉన్న వాటిని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వినాయక సాగర్ వద్ద స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్‌ను త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కొర్లగుంట వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు తప్పించాలని స్పష్టం చేశారు. లక్ష్మీపురం, మామిడికాయల మండి వద్ద కూడళ్లలో ట్రాఫిక్ జామ్ నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

నగర సంకీర్తన అభినందనీయం

తిరుపతి కల్చరల్ : రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న నగర సంకీర్తన అభినందనీయమని శతావధాని, ప్రవచన కర్త ఉప్పలదడియం భరత్ శర్మ ప్రశంసించారు. శనివారం శ్రీగోవిందరాజస్వామివారి ఆలయ మాడ వీధుల్లో భజన మండలి సభ్యులు నగర సంకీర్తన చేపట్టారు. భరత్ శర్మ మాట్లాడుతూ భగవంతుడిని చేరేందుకు సులువైన మార్గం నామ సంకీర్తనమే అని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కా వాలని కోరారు. రంగస్థలి చైర్మన్ గుండా గోపీనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మునినాధరెడ్డి పాల్గొన్నారు.

చెవిరెడ్డి అక్రమ అరెస్ట్ దారుణం

తిరుపతి రూరల్ : మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టు అన్యాయమని, ఆయన కుమారుడిపై అక్రమ కేసు బనాయించడం దారుణమని అనంతపురం జిల్లా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. శనివారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మిని పరామర్శించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని, జగనన్న పాలనలో అందరికీ మళ్లీ మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు.



చెవిరెడ్డి లక్ష్మితో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

యాజమాన్యంతో అధిక దిగుబడి

తిరుపతి సిటీ : వాతావరణ అనుకూలిత యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వారు వ్యవసాయంలో సవాళ్లు, వాతావరణ అనుకూలిత, నూతన ఆవిష్కరణలు అనే అంశాలపై నిర్వహించిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ పశుగ్రాస పంటలు, పాడి పరిశ్రమ అభివృద్ధిలోయాజమాన్య పద్ధతులు కీలక పాత్ర వహిస్తాయన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ సదస్సులో సాగుపద్ధతులు, పంటల యాజమాన్యంలో చేసిన పరిశోధన ఫలితాలపై చర్చించినట్టు తెలిపారు. అనంతరం ఉత్తమ పరిశోధనలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పీవీ సత్యనారాయణ,వి.సుమతి, ఎం.భరత లక్ష్మీ, ఏపీ రమణ,ఎంపీ రమణ, మునిరత్నం పాల్గొన్నారు.



పరిశోధకులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న అతిథులు

రేపటి నుంచి 'కన్సల్టెంట్ల'కు ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్లకు పెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో స్క్రూటినీ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కన్సల్టెంట్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇప్పటి వరకు ఏ వర్సిటీలోనూ ఈ విధంగా ఇంటర్వ్యూలు చేపట్టలేదని, ఎస్వీయూలో కొత్త విధానాలకు తెరతీస్తున్నారని కన్సల్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్యాపకులను రోడ్డుపాలు చేసేందుకే కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపించారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్ష



దీక్షా శిబిరంలో కార్మికులు, నేతలు

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రి కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం మూడో రోజుకు చేరుకుంది. విశ్రాంత జిల్లా జడ్జి గుర్రప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణం మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు టీటీడీ చొరవతీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్నేక్ క్యాచర్‌కు పాము కాటు

- ఐసీయూలో చికిత్సపొందుతున్న భాస్కర్‌నాయుడు

తిరుమల/రేణిగుంట : టీటీడీ అటవీశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు(68) మరోమారు విష నాగు కాటుకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం మధ్యాహ్నం తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఓ పెద్దనాగుపాము ఉన్నట్లు భాస్కర్‌నాయుడుకు స్థానికులు సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకుని పామును పట్టుకోబోతుండగా కాటు వేసింది. హుటాహుటిన టీటీడీ అశ్విని ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కరకంబాడిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. శనివారం ఈమేరకు వైద్యబృందం ఓ ప్రకటన విడుదల చేసింది. భాస్కర్‌నాయుడు ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు. ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్య బులెటిన్ విడుదల చేస్తామని ప్రకటించింది.



ఆస్పత్రిలో భాస్కర్ నాయుడు

రుయా అభివృద్ధే లక్ష్యం

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం ఎస్వీ వైద్య కళాశాలలో రుయా అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధ్యక్షత పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కమిషనర్ మౌర్య, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ప్రసూతి ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రమీల, రుయా హాస్పిటల్ అడ్మిన్ అధికారి కనక నరసారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్, డాక్టర్ ఆనందమూర్తి, కమిటీ సభ్యులు బి.లక్ష్మీపతి, కాజా మొహిద్దీన్, కరణం సందీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మంచినీళ్ల కుంట పరిరక్షణకు చర్యలు

తిరుపతి తుడా : నగరంలోని మంచినీళ్ల కుంట పరిరక్షణకు చర్యలు చేపడతామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆయన కుంటను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రైనేజీ నీరు కలవడంతో కుంట కలుషితమవుతోందన్నారు. దీంతో సుమారు 30 వేల నుంచి 40వేల మంది వినియోగించే తాగునీటి బోర్లలోకి ఈ జలాలు చేరుతున్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో మంచినీళ్ల కుంటను పరిశుభ్రంగా మార్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వంశీ, కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ సేవలు అవసరం

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో కిడ్నీ, గుండె సూపర్ స్పెషాలిటీ సేవలు అవసరమని, వాటిని వెంటనే ప్రారంభించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రుయాలో పేద రోగులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీగౌడ్, తేజోవతి, రావణ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న చింతామోహన్